క్లుప్తంగా

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి సహకరించాలి



పాఠశాలకు కంప్యూటర్లు అందజేస్తున్న బ్యాంకు సిబ్బంది

సూర్యాపేటటౌన్ : ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ప్రతిఒక్కరూ సహకరించాలని సూర్యాపేట ఎంఈఓ శేషగాని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలకు ఐడీబీఐ బ్యాంకు ఆధ్వర్యంలో రూ.1,50,000 విలువ గల ఐదు కంప్యూటర్లు, ఆరు ఫ్యాన్లు, ఆరు కుర్చీలు అందజేశారు. కార్యక్రమంలో ఐడీబీఐ బ్యాంకు రీజినల్ కోఆర్డినేటర్ సుధీర్ ఆదిరెడ్డి, సూర్యాపేట బ్రాంచ్ మేనేజర్ కె.నాగరాజు, హెచ్‌ఎం ఆర్.నాగరాణి, పాఠశాల ఉపాధ్యాయులు, సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

శ్రీలక్ష్మీనర్సింహస్వామి కల్యాణం



స్వామివారికి కల్యాణం జరిపిస్తున్న అర్చకులు

చివ్వెంల : మండల పరిధిలోని ఉండ్రుగొండ గిరిదుర్గంలో వెలిసిన శ్రీలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో బుధవారం పుష్యమాస స్వాతీనక్షత్రం సందర్భంగా స్వామి వారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీమాన్ రవికుమారచార్యులు, శ్రీమాన్ క్రిష్ణమాచార్యులు మంత్రోచ్చరణతో స్వామి వారికి పట్టువస్త్రాలు సమర్పించి, శ్రీదేవి, భూదేవి సమేతంగా కల్యాణం జరిపించారు. అనంతరం కార్యక్రమానికి హాజరైన భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చకిలం కృష్ణకుమార్, బందకవి కృష్ణమోహన్, మధుసూదన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

క్రమం తప్పకుండా టీకాలు వేయించాలి



వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న డీఎంహెచ్‌ఓ కోటాచలం

నాగారం : వైద్యారోగ్య సిబ్బంది విధిగా గర్భిణులు, చిన్నారులకు క్రమం తప్పకుండా టీకాలు వేయించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ కోటాచలం సూచించారు. బుధవారం మండలంలోని చంద్రారెడ్డినగర్‌లో నిర్వహించిన జాతీయ వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించి మాట్లాడారు. ఆరోగ్య సిబ్బంది 30సంవత్సరాల పైబడిన ప్రతి ఒక్కరికీ అసంక్రమిత వ్యాధుల నివారణ కార్యక్రమంలో భాగంగా షుగర్, బీపీ, క్యాన్సర్ నిర్ధారణ పరీక్షలు నిర్వహించాలని సూచించారు. వ్యాధులను సకాలంలో గుర్తించి మందులు వాడడంతో అదుపులో ఉంచుకోవచ్చన్నారు. కార్యక్రమంలో సామాజిక ఆరోగ్య అధికారి మాలోతు బిచ్చునాయక్, పీహెచ్‌ఎన్ గొట్టే అరుణకుమారి, సూపర్‌వైజర్ రామచంద్ర, పార్వతీ, సుమ, క్రాంతబాయి పాల్గొన్నారు.

డిగ్రీ ఫలితాల్లో విద్యార్థుల ప్రతిభ

సూర్యాపేటటౌన్ : మహాత్మాగాంధీ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు బుధవారం వెలువడ్డాయి. ఈ ఫలితాల్లో జిల్లా కేంద్రంలోని మహర్షి డిగ్రీ కళాశాల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించినట్టు ప్రిన్సిపాల్ పల్లె నగేష్, కరస్పాండెంట్ ప్రవీణ్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ రమాదేవి తెలిపారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను అభినందించారు.

స్పందన విద్యార్థులు..

డిగ్రీ సెమిస్టర్ ఫలితాల్లో తమ కళాశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులు 10కి 10 జీపీఏ సాధించారని జిల్లా కేంద్రంలోని స్పందన డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ బాల్తు సైదారావు, కరస్పాండెంట్ తీకుళ్ల శ్రీనివాసరెడ్డి తెలిపారు. కళాశాలలో ఏర్పాటు చేసిన ప్రత్యేక కార్యక్రమంలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను వారు అభినందించారు.

కోలాటం పోటీలు ప్రారంభం

పెన్‌పహాడ్ : మండలంలోని దూపహాడ్ గ్రామంలో మహబూబాబా ఉర్సు సందర్భంగా ఏర్పాటు చేసిన జిల్లా స్థాయి కోలాటం పోటీలను బుధవారం దర్గా నిర్వాహకుడు సందీప్ ప్రారంభించారు. కార్యక్రమంలో దొంగరి మురళయ్య, సైదులు, సునీల్, సందీప్, హుస్సేన్ తదితరులు పాల్గొన్నారు.

కాల్వకు మరమ్మతులు

అర్వపల్లి : ఎస్సారెస్పీ 71డీబీఎం కాల్వ నుంచి మండల పరిధిలోని కొమ్మాల గ్రామానికి వెళ్లే మైనర్ కాల్వకు గోదావరి జలాలు వచ్చేలా గ్రామ రైతులు స్వచ్ఛందంగా బుధవారం జేసీబీతో మరమ్మతులు చేయించారు. గోదావరి జలాలు గ్రామంలోని చెరువుకు వచ్చేలా కాల్వలోని కంపచెట్లు, పూడికను తొలగింపజేశారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

మహబూబాబా ఉర్సుకు వేళాయే..

- నేటి నుంచి ఈ నెల 25 వరకు దూపహాడ్ దర్గా ఉర్సు
- జాన్‌పహాడ్ నుంచి గంధం తేవడంతో ప్రారంభం కానున్న ఉత్సవాలు
- ఏర్పాట్లు పూర్తి చేసిన నిర్వాహకులు



ఉత్సవాలకు ముస్తాబైన దర్గా



దర్గాలోని మహబూబా పవిత్ర సమాధి

పెన్‌పహాడ్ : మండల పరిధిలోని దూపహాడ్‌లో జాన్‌పహాడ్ ఉర్సుకు ప్రతీకగా ప్రతి సంవత్సరం నిర్వహించే మహబూబా ఉర్సు గురువారం నుంచి ప్రారంభం కానుంది. ప్రతి సంవత్సరం జాన్‌పహాడ్ ఉర్సు ప్రారంభమైన రోజు నుంచి మూడు రోజుల పాటు దూపహాడ్‌లో ఉర్సు జరుగుతుండడం ఆనవాయితీ. అయితే ఏడాదికి సంబంధించి ఈ నెల 23 నుంచి 25వ తేదీ వరకు ఉత్సవాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఉత్సవాల సందర్భంగా దర్గాను విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు. ఉత్సవాల్లో భక్తులకు ఇబ్బందులు కలుగకుండా ఏర్పాట్లు చేశారు.

పెద్దసంఖ్యలో తరలిరానున్న భక్తులు..

సంతానం లేనివారు, అనారోగ్య బాధితులు, కోర్కెలు తీరిన భక్తులు ప్రతి సంవత్సరం దూపహాడ్‌లో జరిగే మహబూబా ఉర్సు ఉత్సవాల్లో పాల్గొంటారు. జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధంను ఊరేగింపుగా తీసుకురావడంతో ఉత్సవం ప్రారంభమవుతుంది. మునగాల, గరిడేపల్లి, నేరేడుచర్ల, పెన్‌పహాడ్, హుజూర్‌నగర్, సూర్యాపేట, మిర్యాలగూడ తదితర మండలాల నుంచి భక్తులు వస్తుంటారు. ఈ దర్గా దురాజ్‌పల్లి, నేరేడుచర్ల ప్రధాన రహదారిపై ఉండడంతో భక్తులు పెద్దసంఖ్యలో తరలివస్తుంటారు. ఈ దర్గా వద్ద నాగ దేవత పుట్ట వెలిసింది. భక్తులు దర్గా ఉర్సులో పాల్గొనడంతోపాటు నాగదేవతకు పూజలు చేయడం ఇక్కడ ప్రత్యేకత.

మూడు రోజులపాటు..

నేడు దూపహాడ్ దర్గా నిర్వాహకులు సాయంత్రం జాన్‌పహాడ్ దర్గా నుంచి గంధం తీసుకొస్తారు. 24న గంధంను ఊరేగింపుగా కవాలి, ఫకీర్ విన్యాసాలతో, మేళతాళాలతో మహబూబా సుభాని దర్గాకు చేరుస్తారు. 25న దీపారాధన కార్యక్రమం నిర్వహించడంతో ఉర్సు ముగియనుంది.

కోలాటం పోటీలు..

ఉత్సవాల్లో భాగంగా జిల్లా స్థాయి కోలాటం పోటీలు నిర్వహిస్తున్నారు. పోటీల్లో గెలుపొందిన విజేతలకు ప్రథమ బహుమతి రూ. 20116, ద్వితీయ బహుమతి రూ.15116, తృతీయ బహుమతి రూ.10116, చతుర్థ బహుమతి రూ.5000 అందజేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

దురాజ్‌పల్లి జాతర ఎగ్జిబిషన్, దుకాణాల టెండర్లు ఓపెన్



టెండర్ బాక్స్ ఓపెన్ చేస్తున్న అధికారులు

సూర్యాపేట : దురాజ్‌పల్లిలో లింగమంతుల స్వామి జాతరకు సంబంధించి ఎగ్జిబిషన్, చిరు దుకాణాలు, ఖాళీ స్థలం, మిఠాయి, స్వీట్స్, వరిపేలాలు, బొంగులు, చెరుకు గడల విక్రయాలు, జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు ఇటీవల టెండర్లు పిలిచారు. కాగా సూర్యాపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ టెండరుదార్ల సమక్షంలో బుధవారం టెండర్ బాక్స్‌లను ఓపెన్ చేశారు. ఈ టెండర్లలో ఎగ్జిబిషన్ ఐటమ్స్‌కు సంబంధించి 15దరఖాస్తులు రాగా ఏడుగురు టెండర్లు సమర్పించగా రూ.35,50,000లకు ఎల్.గోపాల్‌కృష్ణ టెండర్ దక్కించుకున్నారు. చిరు దుకాణాలు, ఖాళీ స్థలానికి 9దరఖాస్తులు రాగా ఐదుగురు టెండర్లు సమర్పించగా ఎంఏ వాజిద్‌మియా రూ.6,60,000లకు దక్కించుకున్నారు. మిఠాయి స్వీట్లకు 8దరఖాస్తులు జారీ చేయగా నలుగురు టెండర్లు సమర్పించగా అంచనా రేటు రూ.3,30,000లకంటే తక్కువ రేటు కోట్ చేసినందున రీకాల్ టెండర్ పిలిచినట్లు తెలిపారు. వరి పేలాలు, బొంగులకు 5దరఖాస్తులు రాగా ఇద్దరు టెండర్ వేయగా రూ.1,80,000లకు ఎండీ నశీరుద్దిన్ దక్కించుకున్నారు. అదే విధంగా జాతర చుట్టూ విద్యుత్ సరఫరాకు 2దరఖాస్తులు జారీ చేయగా ఒకరు టెండర్ సమర్పించడంతో మొండికత్తి జానకిరాములు రూ.89,000లకు దక్కించుకున్నారు. 2022–23లో జరిగిన జాతరలో మున్సిపాలిటీకి టెండర్లపై రూ.56,43,754 ఆదాయం రాగా, ఈసారి రూ.68,83,650 ఆదాయం మున్సిపాలిటీకి సమకూరింది.

నేడు ఎమ్మెల్యే రాక

నాగారం : మండలంలోని పసునూర్ గ్రామానికి ఎమ్మెల్యే మందుల సామేలు గురువారం రానున్నట్లు కాంగ్రెస్ మండల అధ్యక్షుడు తొడుసు లింగయ్యయాదవ్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. పసునూర్ గ్రామ సభకు ఎమ్మెల్యే హాజరవుతారని తెలిపారు.

‘క్లాత్ మర్చంట్స్’ ఆధ్వర్యంలో ఆర్థికసాయం



ఆర్థికసాయం అందజేస్తున్న గండూరి శంకర్, గండూరి కృపాకర్, అసోసియేషన్ సభ్యులు

సూర్యాపేట : పట్టణానికి చెందిన బట్టల వ్యాపారి సంగిశెట్టి ఉమా పట్టణంలోని ప్రధాన రహదారిపై కనకదుర్గ క్లాత్ స్టోర్స్ నిర్వహిస్తూ ప్రమాదవశాత్తు మెడకు గాయమై కోమాలోకి వెళ్లింది. ఇటీవల ఆమె తేరుకొని బట్టల షాపును కోల్పోయి ఆర్థిక ఇబ్బందులతో కొత్త బస్టాండ్ రహదారిపై పూల బండి నిర్వహిస్తుంది. దీంతో విషయాన్ని క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ పట్టణ అధ్యక్షుడు గండూరి కృపాకర్, క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు గండూరి శంకర్‌కు తెలియజేయడంతో వారు బట్టల వ్యాపారులతో కలిసి సేకరించిన రూ.37,500ల ఆర్థికసాయాన్ని బుధవారం బాధితురాలు సంగిశెట్టి ఉమకు అందజేశారు. అనంతరం వారు మాట్లాడారు. బట్టల వ్యాపారం నిర్వహిస్తూ ప్రమాదానికి గురై ఆర్థికంగా నష్టపోయిన ఉమ కుటుంబాన్ని ఆదుకునేందుకు సహకరించిన సభ్యులందరికీ కృతజ్ఞతలు తెలిపారు. క్లాత్ మర్చంట్స్ వ్యాపారులంతా వ్యాపార దృక్పథంతోనే కాకుండా సేవా దృక్పథంతో ఆలోచించి ఆర్థిక సహాయం అందజేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పట్టణ క్లాత్ మర్చంట్స్ అసోసియేషన్ నాయకులు శింగిరికొండ ప్రదీప్, అనంతుల రాజేశ్వర్, మొరిశెట్టి కోటేశ్వర్‌రావు, ఎలగందుల సుదర్శన్, వెంకటేశ్వర్లు, చంద్రశేఖర్, గుంటి మధుసూదన్‌రావు, గంచి మహేందర్, పెండెం రామ్మూర్తి, దాసరి రమేష్, చెరుకు కరుణాకర్, సంధ్యారాణి, అరుణ పాల్గొన్నారు.

సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి



సమావేశంలో మాట్లాడుతున్న దేవిడ్‌కుమార్

భానుపురి (సూర్యాపేట) : ఛత్తీస్‌గఢ్‌లో జరిగిన ఎన్‌కౌంటర్‌పై సుప్రీం కోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని సీపీఐ (ఎంఎల్) న్యూడెమోక్రసీ జిల్లా కార్యదర్శి దేవిడ్‌కుమార్ డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక చంద్ర పుల్లారెడ్డి విజ్ఞాన కేంద్రంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశ జీడీపీ 6శాతం మాత్రమే ఉందని, దీనిని పెంచడానికి ఆలోచించాల్సింది పోయి ప్రజల మౌలిక సమస్యలు పరిష్కారం కోసం పోరాడుతున్న నక్సలైట్లను చంపడం దుర్మార్గమైన చర్య అన్నారు. దేశంలో రోజురోజుకు పెరిగిపోతున్న ఆకలి, దరిద్రం, మతోన్మాదంపై ప్రశ్నించినందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం ఎన్‌కౌంటర్లు చేస్తుందన్నారు. ప్రభుత్వాలు ప్రజావ్యతిరేక విధానాలు కొనసాగిస్తే నక్సలైట్ల ఉద్యమాలు కూడా అదే స్థాయిలో ఉంటాయన్నారు. సమావేశంలో ఐఎఫ్‌టీయూ జిల్లా కార్యదర్శి గంట నాగయ్య, ఏఐకేఎంఎస్ జిల్లా కార్యదర్శి బొడ్డు శంకర్, ఐఎఫ్‌టీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కునుకుంట్ల సైదులు, పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పోలేబోయిన కిరణ్, ఓబీసీ జిల్లా కార్యదర్శి దేసోజు మధు, అరుణోదయ జిల్లా అధ్యక్షుడు కంచనపల్లి సైదులు, ఏఐకేఎంఎస్ డివిజన్ అధ్యక్షుడు సంపేట కాశయ్య, పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సింహాద్రి, అరుణోదయ జిల్లా ఉపాధ్యక్షుడు బొల్లె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

ఎస్సారెస్పీ కాల్వ మరమ్మతులకు ఆర్థిక సహకారం



రైతులకు ఆర్థికసాయం అందజేస్తున్న వెంకటేశ్వర్‌రావు, హనుమంతరావు

మద్దిరాల : మండల పరిధిలోని జి.కొత్తపల్లి గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ గంగవెల్లి వెంకటేశ్వర్‌రావు గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ అనే స్వచ్ఛంద సహకారంతో గ్రామంలోని ఎస్సారెస్పీ కాల్వల మరమ్మతులకు ఎన్‌ఆర్‌ఐల సహకారంతో బుధవారం గ్రామ రైతులకు రూ.85వేల ఆర్థికసాయం అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రావు మాట్లాడుతూ.. గ్లోబల్ తెలంగాణ అసోసియేషన్ స్వచ్ఛంద సంస్థ ఎలాంటి లాభాపేక్షలేని సంస్థ అని అన్నారు. గ్రామానికి చెందిన తూర్పు చెరువులోకి నీరు వెళ్లడానికి కాల్వకు మరమ్మతులు చేయాల్సివుందని దానికి రూ.5లక్షల పైనే ఖర్చు అవుతుందన్నారు. కార్యక్రమంలో స్వస్పంద సంస్థ వ్యవస్థాపకుడు విశ్వేశ్వరావు, సెన్స్‌ర్ చాప్టర్ కోర్ సభ్యుడు జి.వెంకటేశ్వర్‌రావు, రిటైర్డ్ ఉపాధ్యాయుడు గంగవెల్లి హనుమంతరావు, రాజేంద్రప్రసాద్, ఉపేందర్, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రత, సైబర్ నేరాలపై అవగాహన



సూర్యాపేట : సమావేశంలో మాట్లాడుతున్న షీటీమ్ ఏఎస్‌ఐ సాలయ్య

సూర్యాపేట : ప్రతిఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలు, సైబర్ నేరాలపై అవగాహన కలిగి ఉండాలని షీ టీమ్ ఏఎస్‌ఐ సాలయ్య అన్నారు. బుధవారం పట్టణ సమీపంలోని రాయినిగూడెం వికాస్ ఫార్మసీ కళాశాలలో రోడ్డు భద్రతా నియమాలు, షీ టీమ్స్, సైబర్ నేరాలపై, గంజాయి, డ్రగ్స్ మత్తుమందులపై పోలీసు కళా బృందంతో విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెడ్‌కానిస్టేబల్ బాబు, వికాస్ ఫార్మసీ కాలేజ్ హెచ్‌ఓడీ నీల, స్వరూప, ఏఓ వినయ్‌కుమార్, షీటీమ్స్ కానిస్టేబల్స్ ఉమా, మహేశ్వర్, యల్లయ్య, గోపయ్య, నాగార్జున, చారి తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనదారులు హెల్మెట్ ధరించాలి

తుంగతుర్తి : ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఎస్‌ఐ రుద్ర క్రాంతికుమార్ అన్నారు. జాతీయ రోడ్డు భద్రత వారోత్సవాల్లో భాగంగా బుధవారం మండల కేంద్రంలో రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రజలకు, వాహనదారులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది, వాహనదారులు పాల్గొన్నారు.

చైన్ సిస్టమ్ పథకాలు నమ్మి మోసపోవద్దు

నాగారం : ప్రజలు చైన్ సిస్టమ్ పథకాలు, మల్టీలెవెల్ మార్కెటింగ్ కంపెనీలలో చేరి ఆర్థికంగా మోసపోవద్దని నాగారం సర్కిల్ సీఐ రఘువీర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల కేంద్రంలో చైన్‌సిస్టమ్ పథకాల మోసాలపై ప్రజలకు అవగాహన కల్పించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్‌ఐ ఎం.ఐలయ్య, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అర్వపల్లి : రోడ్డు భద్రత మాసోత్సవాల్లో భాగంగా బుధవారం మండలంలోని అర్వపల్లిలో ఎస్‌ఐ సీహెచ్.బాలకృష్ణ రోడ్డు నిబంధనలపై ప్రజలకు అవగాహన కల్పించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వవద్దని సూచించారు. కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

తిరపతయ్య మృతికి సంతాపం

పెన్‌పహాడ్ : మండల కేంద్రానికి చెందిన తెలంగాణ మలిదశ ఉద్యమకారుడు, బీఆర్‌ఎస్ నాయకుడు గండికోట తిరపతయ్య(59) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. ఆయన మృతదేహాన్ని వివిధ పార్టీల నాయకులు సందర్శించి పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. వారిలో మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ తూముల భుజంగరావు, తూముల సురేష్‌రావు, దొంగరి యుగేందర్, తూముల ఇంద్రసేనారావు, నెమ్మాది వెంకటేశ్వర్లు, మిర్యాల వెంకటేశ్వర్లు, మామిడి అంజయ్య, దాసరి శ్రీనివాస్, గుంజా వెంకటేశ్వర్లు, వరికుప్పల వెంకన్న, వీరబాబు, తదితరులు ఉన్నారు.

విద్యార్థులు పరిశుభ్రత పాటించాలి

అర్వపల్లి : విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించి ఆరోగ్యంగా ఉండాలని మండల వైద్యాధికారి భూక్య నగేష్ కోరారు. బుధవారం మండల పరిధిలోని కొమ్మాల జెడ్పీహెచ్‌ఎస్‌లో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని విద్యార్థులకు వైద్యపరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. అనంతరం పరిసరాల, వ్యక్తిగత పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బి.శేఖర్, ఎంఎల్‌హెచ్‌పీ వశిత, సూపర్‌వైజర్ లలిత, ల్యాబ్ టెక్నీషియన్ చొక్కయ్య, హెల్త్ అసిస్టెంట్ శ్రీనివాస్, ఏఎన్‌ఎం ఊర్మిళ, అంగన్‌వాడీ టీచర్ యశోద, ఉపాధ్యాయులు, ఆశాకార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలోనే సంక్షేమ ఫలాలు



మద్దిరాల : మాట్లాడుతున్న రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్నయాదవ్



పెన్‌పహాడ్ : మేగ్యాతండా గ్రామసభలో మాట్లాడుతున్న ఆర్డీఓ వేణుమాధవ్‌రావు



సూర్యాపేట : వార్డు సభలో మాట్లాడుతున్న కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్

మద్దిరాల : కాంగ్రెస్ ప్రభుత్వంలోనే ప్రతి పేదవాడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు చెవిటి వెంకన్నయాదవ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పథకాలైన రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, ఇందిరమ్మ ఇండ్లు, నూతన రేషన్ కార్డుల కొరకు అర్హులను గుర్తించడానికి బుధవారం రెండో రోజు గ్రామాల్లో గ్రామసభలు నిర్వహించినట్లు తెలిపారు. మండల పరిధిలోని గుమ్మడవెల్లి గ్రామంలో ఏర్పాటు చేసిన గ్రామ సభలో రాష్ట్ర రైతు కమిషన్ సభ్యుడు చెవిటి వెంకన్న యాదవ్, పోలుమళ్ల గ్రామంలో తుంగతుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి, గోరెంట్ల, చిన్ననెమిలా గ్రామాల్లో తహసీల్దార్ అమీన్‌సింగ్, ముకుందాపురం గ్రామంలో ఎంపీఓ ఇబ్రహీం పాల్గొని దరఖాస్తుదారుల వివరాలు తెలిపారు. ఈ సందర్భంగా చెవిటి వెంకన్న యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం ఏనాడు ప్రజలను పట్టించుకోలేదని అందినకాడికి వారే దోచుకోని రాష్ట్రాన్ని అప్పులపాలు చేశారని అన్నారు. ఆయా కార్యక్రమాలలో డీపీఓ మండల ప్రత్యేక అధికారి నాగయ్య, ఎంపీడీఓ సత్యనారాయణరెడ్డి, ఏఓ అనిషారూహి, తాళ్లపెల్లి సురేష్‌గౌడ్, మల్లేష్, తోట రమేష్, ముజీబ్, కుతీబుద్దిన్, తీగల వెంకన్న, వినోద్, విజయ్, పాక అమృత మల్లు, రేసు లింగయ్య, శ్యాంరెడ్డి, విజయ్, మహిపాల్‌రెడ్డి, శ్రీనివాస్, పుల్లయ్య, సంగని విద్యాసాగర్, కంఠం, శ్రీనివాస్, కుమార్ పాల్గొన్నారు.

ప్రజాపాలన కాదు.. ప్రజావ్యతిరేక పాలన

సూర్యాపేటటౌన్ : పట్టణంలోని 22వ వార్డు రాజీవ్ నగర్‌లో గల మందుల వాడ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన వార్డు సభలో బుధవారం మున్సిపల్ వైస్‌చైర్మన్ పుట్ట కిషోర్ పాల్గొని మాట్లాడారు. నిజమైన లబ్ధిదారులకు సంక్షేమ పథకాలు అందడం లేదన్నారు. ఇది ప్రజాపాలన కాదు.. ఇది ముమ్మాటికీ ప్రజావ్యతిరేకత ప్రజాపాలన అని, ఈ వార్డు సభల పట్ల ప్రజలు ఎంత ఆగ్రహంతో ఉన్నారో ఇప్పటికైనా అర్థమైందా అన్నారు. ఎన్నికల హామీలో చెప్పినట్లుగా అర్హులందరికీ ప్రభుత్వ పథకాలను అందజేయాలని ప్రభుత్వాన్ని బీఆర్‌ఎస్ పక్షాన డిమాండ్ చేస్తున్నామన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

సూర్యాపేట : ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని మున్సిపల్ కమిషనర్ బి.శ్రీనివాస్ అన్నారు. బుధవారం జిల్లా కేంద్రంలోని 15వ వార్డులో నిర్వహించిన వార్డు సభలో ఆయన పాల్గొని మాట్లాడారు. అర్హులందరికీ ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ పథకాలు అందుతాయన్నారు. అనంతరం వార్డు కౌన్సిలర్ ఎలిమినేటి అభినయ్ మాట్లాడారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారే కాకుండా ఇప్పటి వరకు దరఖాస్తు చేసుకోని వారు కూడా ఇప్పుడు నిర్వహిస్తున్న వార్డు సభలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రజా పాలనలో ప్రజల చెంతకే ప్రభుత్వ సంక్షేమ పథకాలు వస్తున్నాయన్నారు. కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వర్దెల్లి శ్రీహరి, తన్వీర్, జ్యోతి, డీఈ సత్యరావు, వార్డ్ ఆఫీసర్ రహీం పాల్గొన్నారు.

అర్హులైన ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలు

నాగారం : అర్హులైన ప్రతిఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ కె.మారయ్య అన్నారు. బుధవారం మండలంలోని నాగారం, ఫణిగిరి, మాచిరెడ్డిపల్లి గ్రామాలల్లో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్ కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి నిర్వహించిన గ్రామసభలలో పాల్గొని మాట్లాడారు. అనంతరం గ్రామసభలలో అర్హుల జాబితా ఆమోదంతో పాటు నూతనంగా ఆయా పథకాల కోసం దరఖాస్తు స్వీకరించారు.

ఫణిగిరిలో గ్రామసభ..

మండల పరిధిలోని ఫణిగిరిలో నిర్వహించిన గ్రామ సభ రసాభాసాగా సాగింది. అధికారులు గ్రామసభలో రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డుల జారీ, ఇందిరమ్మ ఇళ్ల మంజూరుకు సంబంధించి జాబితా వెల్లడిస్తున్న క్రమంలో అర్హులైన తమ పేర్లు లేవని, అనర్హుల పేర్లను జాబితాలో చేర్చారని గ్రామస్తులు అధికారులతో వాగ్వాదానికి దిగారు. దీంతో ఎంపీడీఓ మారయ్య జోక్యం చేసుకొని జాబితాలో పేరు లేనివారు ఆందోళన చెందొద్దని, వారు మళ్లీ దరఖాస్తులు చేసుకోవచ్చని సర్దిచెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ వి.బ్రహ్మయ్య, ఏఓ కృష్ణకాంత్, డీటీ షాహిన్‌బేగం, ఎంపీఎస్‌ఓ చింతమల్ల రమేష్, ఏపీఓ రవి, ఏపీఎం శోభారాణి, కార్యదర్శులు, ఏఈఓలు, ఫీల్డ్‌అసిస్టెంట్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలపై కళాజాత

తుంగతుర్తి : మండల పరిధిలోని గొట్టిపర్తి గ్రామంలో బుధవారం నిర్వహించిన గ్రామసభలో తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన ఆరు గ్యారంటీలపై తెలంగాణ సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా రైతు భరోసా, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల పైన తమ ఆట, పాటలతో ప్రజలకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శేషుకుమార్, ఆర్‌ఐ శ్రీనివాస్, సాంస్కృతిక సారథి టీం లీడర్ ఈర్ల సైదులు, కళాబృందం సభ్యులు గడ్డం ఉదయ్, నాగరాజు, పాలకుర్తి శ్రీకాంత్, డప్పు శంకర్, ఉపేందర్, వేణు, మంజుల, రాధ, స్రవంతి, శిరీష, ప్రజలు ఉన్నారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు

తుంగతుర్తి : అర్హులందరికీ ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందుతాయని ఎంపీడీఓ శేషుకుమార్ అన్నారు. బుధవారం మండల పరిధిలోని గొట్టిపర్తి, సంగెం, మంచతండా, గుడితండా, సూర్యతండా, బాపన్‌బావితండా గ్రామాల్లో నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ దయానందం, ఎంఈఓ బోయిని లింగయ్య, ఇన్‌చార్జ్ ఏడి బాలకృష్ణ, ఎంపీఓ సందీప్, ఆర్‌ఐలు రవీందర్‌రెడ్డి, శ్రీనివాస్, ఏఈఓలు, కార్యదర్శులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ

పెన్‌పహాడ్ : సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, ఎవరూ ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ఆర్డీఓ వేణుమాధవ్‌రావు అన్నారు. బుధవారం మండల పరిధిలోని మేగ్యాతండాలో నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్లు, ఇందిరమ్మ ఆత్మీయ భరోసా వంటి పథకాలకు అర్హులైన ప్రతిఒక్కరూ గ్రామసభల్లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆయా పథకాలకు అర్హులను గుర్తించేందుకు క్షేత్రస్థాయిలో పరిశీలన ఉంటుందన్నారు. అర్హుల జాబితాలో పేర్లు రానీ వారు తిరిగి దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. పలు గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లు, రేషన్‌కార్డు జాబితాలో తమ పేర్లు లేవని గ్రామస్తులు అధికారులను నిలదీయడంతో వారు మరోసారి దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ లాలు, ఎంపీడీఓ వెంకటేశ్వర్‌రావు, ఏఓ అనిల్‌కుమార్, ఎంపీఓ సంజీవయ్య, ఆర్‌ఐలు రంజిత్‌రెడ్డి, అజీజా, ఏపీఎం అజయ్‌నాయక్, ఏపీఓ రవి, పంచాయతీ కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి మున్సిపాలిటీలో..

తిరుమలగిరి : మున్సిపాలిటీ పరిధిలోని 8వవార్డులో బుధవారం వార్డు సభను నిర్వహించారు. ఈ సభలో రైతు భరోసా, కొత్త రేషన్‌కార్డులు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరు కోసం ప్రజలు దరఖాస్తులు చేసుకున్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ శాగంటి అనసూయ, కమిషనర్ సంకి వెంకటమణికరణ్, వార్డు ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్, జూనియర్ అసిస్టెంట్ పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : ప్రభుత్వం అమలు చేయనున్న సంక్షేమ పథకాలపై మండల వ్యాప్తంగా నిర్వహిస్తున్న గ్రామసభలు బుధవారం కొనసాగాయి. రెండో రోజు మండల పరిధిలోని మక్తకొత్తగూడెం, రామన్నగూడెం, అస్లంతండా, శెట్టిగూడెం, పాతసూర్యాపేట, దుబ్బతండా, కొత్తతండా, బోరింగ్‌తండా గ్రామాల్లో అధికారులు గ్రామసభలు నిర్వహించి ఆయా పథకాల అర్హుల జాబితాను చదివి వినిపించారు. కార్యక్రమంలో మండల ప్రత్యేక అధికారి ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్, తహసీల్దార్ హరిచంద్ర ప్రసాద్, ఎంపీడీఓ హాసిఫ్, వ్యవసాయ అధికారిణి దివ్య, సూపరింటెండెంట్ వెంకటాచారి, ఎంపీఓ రాజేష్, అధికారులు పాల్గొన్నారు.

అర్హులకే ప్రభుత్వ పథకాలు

నూతనకల్ : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ పథకాలు అందనున్నాయని మార్కెట్ కమిటీ చైర్మన్ తీగల గిరిధర్‌రెడ్డి అన్నారు. బుధవారం మండల పరిధిలోని మిర్యాల, వెంకెపల్లి, బిక్కుమళ్ల, బక్కహేమ్లాతండా గ్రామాల్లో నిర్వహించిన గ్రామసభల్లో ఆయన పాల్గొని మాట్లాడారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ నాగం జయసుధసుధాకర్‌రెడ్డి, తహసీల్దార్ ఎం.శ్రీనివాసరావు, ఎంపీడీఓ సునీత, మండల వ్యవసాయ అధికారి మురళీబాబు, ఏపీఓ శ్రీరాములు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

ఎంపిక జాబితాకు తీర్మానం ఆమోదం

తిరుమలగిరి : మండలంలోని రాఘవపురం గ్రామ పంచాయతీలో బుధవారం జరిగిన ప్రజా పాలన గ్రామసభలో 4 పథకాలకు సంబంధించిన లబ్ధిదారుల జాబితాను చదివి వినిపించారు. అనంతరం జాబితాను ఏకగ్రీవంగా తీర్మానించి ఆమోదించారు. గ్రామ సభలో గ్రామ ప్రత్యేకాధికారి, మండల విద్యాధికారి ఐ.శాంతయ్య, తహసీల్దార్ డి.హరిప్రసాద్, ఆర్‌ఐ వి.సుజిత్‌రెడ్డి, పంచాయతీ కార్యదర్శి డి.సరిత, మండల సర్వేయర్ జోసఫ్, టీఏ విజయ్ తదితరులు పాల్గొన్నారు.

రెండో రోజు కొనసాగిన గ్రామసభలు

అర్వపల్లి : మండలంలోని పర్సాయపల్లి, బొల్లంపల్లి, లోయపల్లి, నాణ్యతండాలలో రైతు భరోసా గ్రామసభలు బుధవారం రెండో రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా 4 పథకాలకు సంబంధించిన జాబితాల్లోని పేర్లను అధికారులు చదివి వినిపించారు. కార్యక్రమంలో తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాసులు, ఎంపీఓ టి.గోపి, మాజీ జెడ్పీటీసీ కొ్రపిడత అవిలయ్య, ఎస్‌ఐ బాలకృష్ణ, పశువైద్యాధికారి అర్జున్, ఏపీఓ ఉపేందర్, ఎంపీఎస్‌ఓ సైదిరెడ్డి, ఏఓ గణేష్, ఆర్‌ఐ వెంకట్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ జలేందర్‌రావు, ఏఈఓ పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ



అర్వపల్లి : క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ కోటాచలం



ఆత్మకూరు (ఎస్) : క్యాలెండర్లను ఆవిష్కరిస్తున్న సంఘం నాయకులు

అర్వపల్లి : తెలంగాణ పల్లె దవాఖాన డాక్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్లను బుధవారం జిల్లా వైద్యాధికారి చేతుల మీదుగా సూర్యాపేటలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు డాక్టర్ నాజియా, డాక్టర్ శ్రీశైలం, డాక్టర్ నాగరాజు, అసోసియేషన్ సభ్యులు డాక్టర్ వీరేంద్రనాథ్, డాక్టర్ కుంభం విజయ్, అనూష, అమృత, అఖిల్, బిందు, రవీందర్, మౌనిక, మమత పాల్గొన్నారు.

ఆత్మకూరు (ఎస్) : తెలంగాణ మైనార్టీ ఎంప్లాయిస్ సర్వీస్ జిల్లా అసోసియేషన్ ఆధ్వర్యంలో రూపొందించిన నూతన సంవత్సర క్యాలెండర్‌ను స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో బుధవారం ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు షేక్ బడేసాబ్, ఎంపీడీఓ హసీమ్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో మహమ్మద్ హాసన్ అలీ, హనీఫ్ పాల్గొన్నారు.

ఎన్‌కౌంటర్లను నిలపాలి

చివ్వెంల : దేశంలో బీజేపీ ప్రభుత్వం చేస్తున్న బూటకపు ఎన్‌కౌంటర్లను వెంటనే నిలిపివేయాలని సీపీఐ (ఎంఎల్) రెడ్‌స్టార్ పార్టీ రాష్ట్ర కమిటీ కార్యదర్శి మోల్గూరి సైదయ్య అన్నారు. బుధవారం మండల కేంద్రంలో పార్టీ ఆధ్వర్యంలో రూపొందించిన క్యాలెండర్ ఆయన ఆవిష్కరించి మాట్లాడారు. తెలంగాణలో ప్రజా పాలనతో పేద ప్రజలకు ఒరిగిందేమిలేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ కార్యదర్శివర్గ సభ్యుడు బి.రాంచందర్, లింగా, నరేందర్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.



క్యాలెండర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు